

"విజయవంతమైనా పదవ రోజు."

ఆంధ్రుల అభిమాన నటపులులు, జయమాలిన్యం చేస్తూ గుడ్డలు లేని హీరోయిన్లు నటించిన సంచలనాత్మక చిత్రం తాలూకు ప్రకటన కాదది. ఆ పట్టణంలో రిక్షావాళ్ళు సాగిస్తున్న సమ్మె పదవ రోజులోకి ప్రవేశించింది.

యూనియన్ ఆఫీసు ముందు పార్టీ జండా రెపరెప లాడుతూ ఎగురుతోంది. చిన్న అరుగు మీద కర్ర కుర్చీ, డ్రాయరు వున్నాయి. నాయకుడింకా రాలేదు. చిరిగిన జీవితాల్లాంటి గుడ్డలతో, రిక్షాలు తొక్కే యంత్రాలు పీనుగుల్లా ఎదురు చూస్తూ సభని అలంకరించాయి.

"విప్లవం వర్ధిల్లాలి"— "విజయం మనదే"- "ఐకమత్యమే బలం"- "క్రామేడ్ షోణిపాతం

జిందాబాద్!" వగైరా ప్రకటన లున్నాయి గోడల మీద. అవి రిక్షావాళ్ళ ఏడుపుని బయటికి రాకుండా కాపలా కాస్తున్నాయి.

పది గంటల ఎండ పదునైన కత్తిలా వుంది. రిక్షా వాళ్ళు అందరూ ఎదురుచూసే క్షోణి పాతం కోడి మాంసంతో వేయిం చిన గారెల వాసన తెలియకుండా బాబా జర్దా నములుతూ మందార మకరందాలు వలకపోసేలా మంద హాసం చేస్తూ మోటారుసైకిల్ దిగి భారమైన శరీరాన్ని కుర్చీలోకి రవాణా చేశాడు.

అందరూ ఆతృతగా చూస్తు న్నారు శుభవార్త కోసం.

"అందరూ వచ్చారు కదా?" క్షోణిపాతం నెమ్మదిగా అన్నాడు.

"సెప్పరా బాబూ ఆ వార్త?" గమానేలుఆక్రోశించాడు మౌనంగా. గమానేలుకి గట్టిగా అరచేనోరుంది. కాని అదిప్పుడు సమ్మె చేస్తోంది.

విన్నటి బాక్సాఫీసు తార నేటి అమ్మల తార. నిన్న గెలిపించిన కొత్త పార్టీ నేటి ముళ్ళకర్ర. నిన్నటి ఫస్టుక్లాసు విద్యార్థి నేటి నిరుద్యోగి.

నిన్నటి రైతుబిడ్డ గమానేలు, నేటి రిక్షావాలా. అదృష్టవంతులకి సమాజం ఎదుగుతుంది. ప్రగతి మార్గంలో నడుస్తోంది. దురదృష్ట వంతులకి దిగజారిపోతుంది. విన్నే బాగుందనిపిస్తోంది.

"కా ... మ్రే.... డ్స్" క్షోణి పాతం పట్టిపట్టి అరిచేడు.

సభంతా నిశ్శబ్దం. అయిదు మోర్ల తలలు వూపిరి బిగిబట్టి వింటున్నాయి. రెప్పలు కూడా వేయడం లేదు.

క్షోణిపాతం రాజకీయం వాళ్ళ దగ్గర దళారిగా తిరుగుతూంటాడట. ఇంగువ కట్టిన గుడ్డకూడా వాసన వేస్తుంది కదా! క్షోణిపాతం వేషం, వ్యవహారం కూడా రాజకీయ నాయ కుడి లానే వుంటాయి.

"స్వాతంత్ర్యం కోసం పది రోజులుగా మనం సమ్మె చేస్తున్నాం. ఆత్మాభిమానంతో పోరాడుతున్నాం. వారింకా దిగిరాలేదు. మన షరతు లకి అంగీకరించలేదు. మనం రాజీ పడతామని చూస్తున్నారు.

కామ్రేడ్స్! మనం పిరికివాళ్ళం కాము. ఎన్ని కష్టాలు వచ్చినా విజయం పొందే దాకా పోరాటం ఆపం.

మనం దిగిరావల్సిన అవసరం లేదు. తప్పు వారిది. వాళ్ళే మన కాళ్ళ దగ్గరకి రావాలి. ఓపికగా పోరాడి మన శక్తి రుజువు చేద్దాం.

ఇవాళ మంత్రిగారితోను,

చయిర్మన్‌గారితోను మన సమ్మె గురించి ముచ్చటిస్తాను. ఎవరూ సందేహపడవద్దు. విజయం మనదే ....మనదే....”

షోణీపాతం ఉపన్యాసం ఆపి, ‘యూనియన్ జిందాబాద్’ అని నాలుగైదు సార్లు అరచేడు. మిగతా జీవాలు కూడా అందుకున్నాయి.

సభయిపోయింది. కొద్దిమంది ఉత్సాహవంతులైన కార్య కర్తలు షోణీపాతాన్ని చుట్టుముట్టారు. వారు ఏజెంట్లు, నమ్మినబంట్లు.

మిగతా వాళ్ళు ఏడుస్తూ రోడ్డెక్కారు.

సమ్మె రిక్షావాళ్ళకి గండం.... ఆదాయం వుండదు కాబట్టి, ఆకలి భరించలేక వున్నవి అమ్ముకుంటున్నారు- ఆడ శరీరాలు కూడా!

సమ్మె షోణీపాతానికి పండగ పర్వం. మరిన్ని రోజులు సమ్మె జరిగితే బాగుంటుందనుకుంటాడు.

అసలు సమ్మె ఎందుకు జరుగుతోంది?

రిక్షా రంగయ్య యజమానికి ఆరు రూపాయలు బాకీ పడ్డాడు. బాకీ తీర్చకపోతే రిక్షా యివ్వనన్నాడు.

రంగయ్య తన బాధ నాయకుడైన షోణీపాతానికి చెప్పుకున్నాడు. షోణీపాతానికి ఏదో గడబిడ వుండాలి.ఎప్పుడూనలుగురు చుట్టూ తిరుగుతుండాలి. సమస్య లేకపోతే సమస్య సృష్టిస్తాడు.

“ఈ బూర్జువాలవి పడగొట్టటమే మన ధ్యేయం. కార్మిక రక్తంతో వాళ్ళు బంగారు కిరీటాలు చేయించుకుంటున్నారు. ఇంకానా? వీరి ఆటలు సాగనివ్వను. పీడిత జాతికి పట్టిన దయ్యాలు వీరు. వీళ్ళ ఆట కట్టించి కార్మికులకి మంచి రోజులు, బంగారు రోజులు తెస్తాను” అని చిన్న ఉపన్యాసం ఇచ్చి-

“రేపు రిక్షా పుచ్చుకో. ఇవ్వకపోతే జబరదస్తీగా నాలుగు వాయించి లాక్కో. ఏం భయం లేదు. ఏం జరిగినా నేనున్నాను” అని దువ్వి పంపాడు.

రంగయ్య నాయకుడి అండ చూసుకొని యజమాన్ని మెత్తగా తన్ని రిక్షా లాక్కున్నాడు.

“మీరు రిక్షాలు ఇవ్వకండి వాళ్ళ పొగరు చూస్తాను.” రిక్షా యజమానులందర్నీ కల్పి రెచ్చకొట్టి దక్షిణ అందుకొన్నాడుషోణీపాతం.

“మనం తొక్కితేనే వాళ్ళ రిక్షాలు డబ్బు తెస్తున్నాయి. మనం తొక్కకపోతే వాళ్ళ రిక్షాలు తుప్పు పట్టవలసిందే. ఆదాయం లేకపోతే

మన అవసరం తెలుస్తుంది వాళ్ళకి. మన ఐక్యతని రుజువుచేసుకోడా నికి సమ్మె చేద్దాం" క్షోణిపాతం ఇటువచ్చి కీ ఇచ్చాడు.

కథ ప్రారంభమైంది.

అద్దె రిక్షావాళ్ళకి మద్దత్తుగా సొంత రిక్షావాళ్ళని కూడా సమ్మెలో పాల్గొనేలా చేశాడు క్షోణిపాతం.

ఎందుకంటే పట్టణంలో రిక్షాలు తిరక్కపోతే ఆటోవాళ్ళు, టాక్సీ వాళ్ళు కలిసి రోజుకు రెండొందలు క్షోణిపాతానికి లోపాయకారిగా ముట్టచెబుతారు. ఇన్ని లాభా లుండగా సమ్మె పండగ కాదా? పర్వం కాదా? తనకి ప్రగతి కాదా?

సమాధుల మీద పునాదులు తీసే కాలం ఇది. కొందరికి సారా ఇష్టం. కొంతమందికి విస్కీ ఇష్టం. కొంతమందికి రక్తంఇష్టం. సారా విస్కీ త్రాగేవాళ్ళని త్రాగు బోతులంటున్నాం. మరి రక్తం పీల్చేవారినేమనాలి? ఏమందాం?

గమానేలు నెమ్మది నెమ్మదిగా నడుస్తున్నాడు. పరు గెత్తె బలంలేదు. ఒక టన్ను నీర్సం మాత్రం వుంది.

'అదేమీటి? గమానేలు నడిచే రోడ్డుకి ఇరువైపులా గజానికో కాఫీ హోటలుందే. అక్కడ కాఫీ టిఫిన్ భోజనం దొరుకుతాయికదా!' దొరుకుతాయి. కాని అవి అమూల్యం కాదు. మూల్యం చెల్లించుకోవాలి. గమానేలు దగ్గర డబ్బు లేదు. అతడి జేబులు ఖాళీ.

గమానేలు బస్టాండ్ దగ్గిర ఆగాడు. ఆటోవాళ్ళు, జట్కావాళ్ళు రేటు పెంచి జనాన్నిదోచేస్తున్నారు. అందరి దగ్గరా రూపాయలు, నాణేలు గల్లుమంటున్నాయి. అవి తన దగ్గర లేకపోవడం గమానేలుకి బాధగా ఉంది.

'జేబులు కొడదామా? పీకలు కోద్దామా?' అన్న ఆలోచనలు గమా నేలుకి వచ్చాయి. తప్పు గమా నేలుది కాదు.

ఆకలిది, దరిద్రానిది, సమ్మెది.

'రిచ్చాలాగితే ఈపాటికి నాల్గు రూపాయలు ఒచ్చేసేవికావూ? ఓ సార్మినార్ పెట్టె కాలిసే వోడ్ని. సాహేబు ఒటల్లో సాంబారిడ్లీ, రెండు సింగిల్ చాయ్‌లు పుచ్చు కొనేవాడ్ని....' గమానేలు గతాన్ని గుర్తుచేసుకున్నాడు.

టాక్సీలు, జట్కాలు లేన ప్పుడు ఒక శాస్త్రీ బస్ దిగింది. ఆ శాస్త్రీ పేరు షావుకారు భద్రయ్య. సరుకు అర్జంటుగా దుకాణానికి చేరాలి. ఈపాటికే కష్టమర్లు గంతు లేస్తుంటారు.

"ఓరబ్బీ ఇలారా!" గమా

(మిగతా కథ 106 వ పేజీలో)

(బిట్వీన్ ది లైన్స్.....................16 వ పేజీ తరువాయి)

నేలుని చప్పట్లు కొట్టి పిలిచాడు.

గమానేలు వెళ్ళాడు.

"రూపాయి ఇస్తాను. సరకు మోసుకురా?"

"రెండివ్వండి."

రూపాయిన్నరకి బేరం కుదిరింది. మరొకడు వచ్చి తన్నుకుపోతాడని గమానేలు తొందరగా బరువు ఎత్తుకొన్నాడు.

ఒగరుస్తూ నడుస్తున్నాడు బరువుతో. ఆ మూటలో వున్నది సీమ సరుకో, దొంగ సరుకో కాని చచ్చిన ఏనుగంత బరువుంది.

గమానేలు సరుకు దింపి రూపాయిన్నర పుచ్చుకొన్నాడు. తిరిగి పనులు తగులుతాయని బస్స్టాండ్‌కి వచ్చాడు.

"నా లైనుకి నిన్ను ఎవడు రమ్మన్నాడ్రా?" తోపుడు బండిమీద సరకులు మోసే మంగన్న పోట్లాటకి వచ్చాడు.

చుట్టుప్రక్కల దుకాణాలవాళ్ళు మంగన్నని సమర్థించారు. వాళ్ళ అండ చూసుకుని మంగన్న జేబులోని రూపాయిన్నర లాక్కున్నాడు.

"నాను మంచోడ్ని కనుక వూరకుంటున్నాను. ఇలాంటి పొరపాట్లు ఎప్పుడూ సెయ్యబోక." మంగన్న మెహర్బానీగా చూపి వెళ్ళిపోయాడు.

ఎవరూ గమానేలు కష్టాన్ని గుర్తు పెట్టుకోలేదు. దోపిడీ సమాజంలో ధర్మం ఎక్కడ? న్యాయం ఎక్కడ? నీతి ఎక్కడ?

"టిపినీ ముందరే తినేయాల్సిందే ప్రేస్తంలేదు." గమానేలు ఇంటికి బయలుదేరాడు. వేడి వేడి తారు రోడ్డుమీద వడి వడిగా నడవసాగేడు. మిట్టమధ్యాహ్నం ఎండ పిచ్చివాడి చేతిలోని కత్తిలావుంది.

పట్టణం పొలిమేరలో నీటి ముంపువాగు. ఒడ్డునవున్న వందలాది గుడిసెల్లో గమానేలుది కూడ ఒకటి.

రోడ్డు దిగి, మురుగు కాల్వ గెంతి గూడెంలో ప్రవేశించాడు. మర్రిచెట్టు క్రింద ఇటుకలతో పేర్చిన గోడ మధ్య వినాయకుడి విగ్రహం వుంది. ఎదురుగా ధర్మ డబ్బీ, చిన్న పళ్ళెంలో కుంకుమ వున్నాయి. వాటికి కాపలా ధర్మాజీ.

ధర్మాజీకి మూడు పదులుంటాయి. యం. ఎస్సీ. ఫస్టు క్లాసు. ఉత్తరం దక్షిణంలేక నిరుద్యోగిగా మిగిలిపోయాడు. ఆఫీసరు అవుదామనుకున్నవాడు ఆఫీసు బాయ్ కూడా కాలేకపోయాడు. ఆస్థిని నిరుద్యోగం తినేసి-పోస్టాఫీసుని, బస్సులని, రైళ్ళని బాగుచేసింది.

బ్రతకడానికి ధర్మాజీ పూజారి అవతారం ఎత్తాడు.

కాషాయ గుడ్డలు కట్టుకుని శఠగోపం పెట్టి, దేవుడు చల్లగా రక్షిస్తాడు అంటాడు. రక్షిస్తాడు కాబోలు అని జనం, అయిదు పది పైసలు వేస్తూంటారు.

ధర్మాజీకి ఆరేడు రూపాయిలు వస్తాయి రోజూ. ఇప్పుడతన్ని వుద్యోగం వరించినా వెళ్ళడు. సమాజం, ప్రభుత్వం అతడికి వుద్యోగం ఇవ్వకపోయినా దేముడు ఇచ్చాడు.

దేవుళ్ళారా జిందాబాద్! పేట పేటకీ వెలసి నిరుద్యోగుల కింత అన్నం పెట్టండి. ఆత్యహత్యల నుంచి కాపాడండి.

ధర్మాజీ గమానేలుని పిలిచాడు. "ఇవాళ పండగరోజు బాబూ! దైవ దర్శనం చేసుకో."

"సాయింతరం వత్తాను స్వామీ!" చిల్లర లేనందుకు చింతించి గమానేలు ముందుకు సాగిపోయాడు.

ఎండలో గుడిసెలు కాలిపోక పోయినా, కేకలతో, బూతులతో, ఏడుపులతో మార్మోగుతున్నాయి. గమానేలు గుడిసె కూడ డిటో.

అరుగుమీద కుక్కి మంచం మీద అంకయ్య మూల్గుతున్నాడు. ఎదురు అరుగుపై కిష్టాయి, సాయి- దెబ్బలుతిన్న చారలతో గోచీలతో చాపలో బోర్లా పడుకున్నారు. నాపరాయిమీద బట్టలు ఉతుకుతూ, ఆరేసుకోబోయి పారేసుకున్నాను పాట పాడుతూంది సుబ్బులు.

"నీకేం గంగిరెద్దులా తిరిగొత్తావ్. ఈ ఎదవమూకతో నాను సత్తున్నా! కిట్టాయిని, సాయిని పోలీసోళ్ళు చచ్చేలా కొట్టారు- సినిమా ఆలుకాడ ఎవడి వర్సో కొట్టేత్తూంటే. వాళ్ళని అలా వదిలేసే కంటే ఎందులోనైనా పెట్టరాదూ?" కరచే గొంతుకతో మీద పడింది ఆగమ్మ.

బస్ స్టాండులో పొందిన అవమానం వల్ల గమానేలు హీటెక్కిపోయి "కొంపకి రాగానే మీద పడతావేం?" అని కాలితో తన్నాడు.

ఆగమ్మ క్రిందపడింది, "ఓరి నచ్చినోడా" అంటూ.

కిష్టాయి, సాయి ఇద్దరూ తండ్రిని చుట్టుముట్టారు- "ఇందాకట్నుంచీ విన్నుతిడుతోందయ్యా!"

"ఏమే లంజా! కుర్రాళ్ళ ఎదుర నన్ను తిడతావా?" గమానేలు స్పీడుగా వెళ్ళి జుట్టు పుచ్చుకు లాగి ఎడా పెడా వాయించాడు.

"ఓలమ్మో సంపేత్తున్నాడ్రా" ఆగమ్మ రాగాలు తీసింది.

"అమ్మని....కొట్టకయ్యా!" సుబ్బులు అడ్డం వచ్చింది.

గమానేలు మరో తాపు తన్ని అరుగుమీదకిపోయి కూర్చున్నాడు. "నేను రాక్షసుడ్ని. కోపం తెప్పించకండి."

ఇదే సమయంలో మంచంమీది అంకయ్య బాధతో కెవ్వుమన్నాడు. రోగాలు అంకయ్యలో వున్నాయనడం కంటె, అంకయ్య రోగాల్లో వున్నాడనడం సబబు.

అంతా మంచం చుట్టుముట్టారు. పేట వైద్యుడికి కబురు వెళ్ళింది. అతడు లేడు.

గమానేలు తండ్రిని రిక్షాలో వేసి, 'కుటుంబం వైద్యశాల'కేసి త్రొక్కసాగేడు.

గమానేలు రిక్షా తొక్కుతూ వెళ్ళడం చాలామంది చూపి వుండవచ్చు. కొటిలింగం పగ అనే రంగుటద్దంలో నుంచి చూశాడు. విడ్డూరంగా కనిపించింది. వక్రంగా కనిపించింది. మోసంగా కనిపించింది.

"ఎక్కడికి పోతున్నావ్రో సూద్రా!" శిష్యుడ్ని పరుగెట్టించాడు.

గమానేలుకు కోటిలింగం శత్రుత్వం ఎలా వచ్చిందంటే....

అనగనగా ఒక పాపమ్మ. గమానేలు గూడెంలోనే వుంటోంది. పాపమ్మకి ఓట్ల లెక్క ప్రకారం నలభై ఏళ్ళు. కాని సగం వయసుగానే కనిపిస్తుంది. రోజురోజుకి సొగసు పెరుగుతోంది. తరగడంలేదు. కురుక్షేత్రం వీధి నాటకానికి మూడో కృష్ణుడున్నట్లే ప్రస్తుతం ఆమె జీవితానికి మూడోమొగుడు 'శావలా'గా వున్నాడు. అతడు లారీ డ్రయివర్. రూట్ మీద లేక పోతే లోడ్ మీద వుంటాడు.

పాపమ్మ తన అందాన్ని విరివిగా అందరికీ పంచిపెట్టేయదు. రేషను సరుకులా యిస్తుంది. తన సోయగం సాయంత్రంతో పెద్దపెద్ద హోటళ్ళని పట్టుకుని తీసిన విస్తర్లలోని అన్నం వగైరాలు ప్రోగేసి చిన్నచిన్న పొట్లాలుకట్టి 'పావలా'కి అమ్ముతూంటుంది. అందరూ ఆవిడ్ని పావలా పాపమ్మంటారు.

కోటిలింగం రమ్ము నిషాతో ఓ సాయంత్రం అన్నం కొనుక్కోడానికి వచ్చి అది మరచిపోయి పాపమ్మ అందాన్ని కొనుక్కోవాలనుకున్నాడు.

"ఎన్నపూసలా ఎలా మెరిసిపోతున్నాయ్ తెల్లటి సీకలో నీ తొడలు." పక్కన కూర్చుని ఆమెని దగ్గరికి లాక్కున్నాడు.

"ఓర్నాయనోయ్.... ఈడి జిమ్మడ. దవుపదిలా కోకలు ఒల చేత్తున్నాడ్రోయ్. రచ్చించండి." పాపమ్మ పతివ్రతలా పోలికేక పెట్టింది.

కోటిలింగం ఓ యిరవై నోటు చూపించి, 'ఇది నీదే. నువ్వు నా దానివే' అంటే పాపమ్మ మురిసిపోయి రాత్రి తనంత తానే చీర విప్పేది.

కోటిలింగం దుర్మార్గుడై పోయాడు.

క్రిష్ణ పరమాత్మలా గమానేలు వచ్చేశాడు.

"ఎంట్రా ఆ ఎదవపని... అది మన అడ కూతురుకాదూ? ఒంటరిగా దొరికిందని ఎవ్వారం సేస్తావా?" గమానేలు మంద లించాడు.

"పోరా పొల్లు ఎదవా?" కోటి లింగం తనపని మానలేదు.

"నా మొగుడుంటే సరికే సుంద్రా....తాగిన సచ్చినాడికి ప్రెతి ఆడదీ పెల్లాంగానే కనిపిస్తుం దేమిట్రా?" పావలా పాపమ్మ పెనుగులాడింది.

వ్యవహారం శృతి మించడం వల్ల గమానేలు మాటలు వదిలి, చేతులకి పని చెప్పాడు. కోటి లింగం దెబ్బలకి ఆగలేకపోయాడు.

"నీ అంతు సూస్తారా?" అని పరుగెత్తాడు.

ఇదే పగకి కారణం. అది తీర్చుకునే సమయం నేడు వచ్చింది.

శిష్యుడు వచ్చి కోటిలింగానికి చెప్పాడు. జరిగినదానికి మసిపూసి "గమానేలు ఆ లంజ కొడుకు సుబ్రంగా రిచ్చా తొక్కేస్తున్నా డయ్యా. యూనియన్ మాటలెక్క లేదంట" యూనియన్ ఆఫీసుకి వచ్చి ఫిర్యాదు చేశాడు.

షోణిపాతం ఆందోళనగా చూసాడు.

"తీసుకురా వాడ్ని. ఇలాంటివి బేగా బాగుసెయ్యాలి. లేకపోతే ప్రమాదం. ఈడ్ని వదిలేత్తే మరోడు సేస్తాడు."

కోటిలింగం బాణంలా బయటకి పరుగెత్తాడు. తన అనుచరులని ప్రోగేసాడు. వాళ్ళందరూ కూడ షోణిపాతం బంట్లు. కోటిలింగానికి షోణిపాతానికి చిన్న చుట్టరికం కూడ వుంది. అందుకని కోటి లింగాన్ని ఎవరూ కాదనరు. కోటి లింగం ఇద్దర్ని 'కుటుంబం వైద్యశాల'కి పంపించాడు.

తర్వాత నెమ్మదిగా నలుగుర్ని తీసుకుని బయలుదేరాడు.

గమానేలు సెంటర్లో కని

పించాడు. కనిపించిన ముఖాన్నల్లా అప్పు అడిగేస్తున్నాడు.

తండ్రిని రక్షించుకుందామని....

"పెసిడెంటు విన్ను రమ్మంటున్నాడ్రా!" కోటిలింగం చెప్పాడు.

"ఇపుడా.... మా అయ్యకి పేనాల మీదకి వచ్చింది. డాట్టరు బాబు మందులు తెమ్మన్నాడు."

"నీ కదలేం సెప్పకురా. డైరేటుగా సెప్పు.... ఒత్తావా? రావా?"

"తరవాత ఒత్తాను."

"నీకోసం క్షోణిపాతం బాబు అప్పుడుదాకా కూకుంటాడా? ఓరి గాడిద కొడకా. అపుడే కళ్ళు పొరలు కమ్మేయా?" కోటిలింగం గద్దించాడు.

గమానేలు కంగారుగా భయంగా వున్నాడు- తండ్రి ఏమవుతాడోనని. ఇపుడీ గొడవ.

గమానేలు గొడవ పెంచుకోకుండా వార్ని అనుసరించాడు. గమానేలు కాదంటే వాళ్ళు బలవంతంగా లాక్కుపోయేలా వున్నారు. "సమ్మెరోజున రిషా తొక్కకూడదని తెల్పా?" క్షోణిపాతం గర్జించాడు.

"తెలుసు బాబూ."

"తెలిసే ఎందుకు చేశావ్? కండకావరమా?"

"అందులో పేసెంజర్ లేదు బాబూ. మా అయ్య రోగంలో వున్నాడు. ఆసుపత్రికి తీసుకుపోయాను. ఇది విజం బాబూ!"

కోటిలింగం అడ్డుపడి- "అబద్ధమయ్యా నమ్మకండి" అన్నాడు.

క్షోణిపాతం కోటిలింగాన్ని పరిశీలించి చూశాడు. ఇందులో ఏదో కలిసివచ్చేది వుందనిపించింది. "రుజువు చేస్తావా?" గమానేల్ని గద్దించాడు.

"అలాగే బాబూ!"

"అబద్ధమని తెలిస్తే నీ అంతు చూస్తాం." క్షోణిపాతం పరివారంతో గమానేలుతో కుటుంబ వైద్యశాలకి బయలుదేరాడు.

గమానేలు రుజువు చెయ్యలేకపోయాడు.

"ఇతడు ఎవర్నీ తీసుకురాలేదు" అన్నాడు డాక్టర్ కుటుంబం.

క్షోణిపాతం బృందం ఘోరంగా నవ్వేరు. గమానేలుకి పగలే చీకటిగా ఉంది. డాక్టర్ కాళ్ళమీదపడి, "డాట్రు బాబూ! మా అయ్యని తీసుకురాలేదూ? మీరు మందులు తెమ్మనలేదూ? నిజం సెప్పండి బాబూ" అంటూ ఏడ్చాడు.

డాక్టరుగారు కోప్పడ్డారు.

"ఏరా! సమ్మెరోజున రిచ్చా తొక్కి మమ్మల్ని గాడిదల్ని చేస్తావా? పైగా అయ్యకి పేనం

మీదకి వచ్చిందని అబద్ధమా? ఏద్రా మీ అయ్య?" ఓ రిక్షావాడు చెంప చెళ్ మనిపించాడు.

గమానేలుకి దెబ్బలు తెలీయడం లేదు. అయ్య ఏమైనాడు? అది రోగం ఎలాగుంది? డాక్టరు బాబు అబద్ధం సెప్పాదేంటి?

డాక్టర్ కుటుంబం హరిశ్చంద్రుడు కాదు. అబద్ధాలు ఆడగలదు దబ్బొస్తే. కోటిలింగం మనుషులు వచ్చేసరికి అంకయ్య చచ్చి ఉన్నాడు. వాళ్ళు కొన్ని నోట్లుపెట్టి, "శవాన్ని లాక్కుపోతాం. మీరిలా చెప్పాల" అన్నారు. కుటుంబం ఒప్పుకొన్నాడు.

గమానేలు పిచ్చి ఆవేశంతో వాళ్ళని వదిలించుకొన్నాడు. 'అయ్యా!' అంటూ హాస్పిటల్ అంతా వెతికాడు. తండ్రి కనపడ లేదు. కొడుకులు వచ్చి ఇంటికి తీసుకుపోయారేమోనని రోడ్డుమీద పరుగెత్తసాగేడు.


# సినిమా డైరీ 1979

## ఎడిటర్ : మోహన్‌కుమార్

మార్పు చేయబడిన సరికొత్త డోర్ నంబర్లతో- మీ అభిమాన తారలు, దర్శకులు, రచయితలు, సంగీత దర్శకులు, ప్రొడక్షన్ కంపెనీల చిరునామాలు, టెలిఫోన్ నంబర్లు, సినిమా పరిశ్రమకు సంబంధించిన సమగ్ర విశేషాలతో, ఆఫ్‌సెట్ ముద్రణలో అందంగా తయారయింది.

విడి ప్రతి వెల: రూ. 2.50 పై.

ఈ 'సినిమా డైరీ 1979' లో — సినిమా విశేషాలతో పాటు మద్రాసు నగరం సందర్శించాలనుకునేవారికి- నగరంలో చూడవలసిన వింతలు-విశేషాలు, థియేటర్లు, షాపింగ్ సెంటర్స్, హోటల్స్ చిరునామాలు, టెలిఫోన్ నంబర్సు కూడా వున్నాయి. రైళ్ళ రాకపోకలు, విమానాల వేళలు మున్నగు ఎన్నో వివరాలతో వెలువడింది.

ప్రతులకు :

'సినిమా డైరీ'

80- ధనలక్ష్మి కాలనీ, మద్రాసు-600 026.

"మీ అయ్యవి ఇందాక ఇలా లాక్కు పోయా ర్రా?" ఒకడు చెప్పాడు.

ఆ దారి శ్మశానానికి తీసుకు పోయింది. కోటిలింగం మనుషులు గొయ్యి తవ్వుతున్నారు. గమానేలుని చూసి పారిపోయారు.

గమానేలు ఆవేశం తగ్గింది. ఆందోళన తగ్గింది. శవం ముందు నిశ్చలంగా కూర్చున్నాడు. ఏడుపు రాలేదు.

"సచ్చి సుకపడ్డావురా. దరిద్రం వల్ల కొడుకునై యుండి నీకు మందులు తేలేకపోయాను. నీ పేనం రచ్చించలేకపోయాను. నీ బరువు మాకు తగ్గిపోయింది-అదృష్టం! దేముడు నీ బాధలు తీర్చాడు. సంగం గోరంగా పీక్కుతినే మన లాంటి వోళ్ళకి సావుకంటె సుభ వోర్త ఏముందిరా? మన కట్టాలు బాధలు తీర్చేది పెబుత్వం, సంగం కాదురా.... సావే తీర్చాల- సావే దారి చూపించాల. నీలా మేం ఎప్పుడు సుకపడతాంరా? ఆ అదృష్టం ఎప్పుడ్రా మాకు?"

గమానేలు తండ్రిని హూడ్చి ఊర్లోకి వచ్చాడు. అలసిపోయి బురదలో దొర్లిన పందిలావున్నాడు.

యూనియన్ ఆఫీసు పెళ్ళి వారిల్లులా వుంది. సినీతారలు అందంగా ముష్టి ఎత్తుకుంటున్న వీధిలా వుంది. గమానేలుకి లోపలికి వెళ్ళాలనిపించలేదు. కుటుంబం వైద్యశాల దగ్గరున్న రిక్షాకోసం నడిచాడు. దూరాన్నుంచే చూసి వణికి పోయాడు.

రిక్షా మంటల్లో వుంది. మసి అవుతూవుంది. మాడిపోతూవుంది.

గమానేలు ఏడ్చాడు. వెక్కి వెక్కి ఏడ్చాడు. శక్తి లేకపోయినా ఘోరంగా ఏడ్చాడు. రెండు సింహాల మధ్య మేక బ్రతుకుతుందా?

మర్నాడు రిక్షావాళ్ళ సమ్మె విరమించబడింది. ధనిక వర్గమే కాకుండా తమకి ప్రాతినిధ్యం వహించే క్షోణిపాతాలూ భస్మాసురులవుతున్నారని గమానేలు లాంటి వారికి తెలియకపోవడం వాళ్ళకి శ్రీరామరక్ష, వీళ్ళకి తరగని శిక్ష. వీరి కన్నీళ్ళు సహజ నదులు. ఎప్పుడూ ఎండిపోవు. ఇంకిపోవు. తరిగిపోవు.

గమానేలు సమ్మె ఇంకా పూర్తికాలేదు. *

Published by K. Rajendra Babu, 80- Dhanalaxmi Colony. Madras 600 026, Printed by Vijaya Bapineedu at Vijaya Graphics; 210- Arcot Road. Madras- 600 026. Phone: 422233
• Editor: VIJAYA BAPINEEDU